కరివేపాకు రైతు ధరహాసం

- మార్కెట్‌లో కిలో రూ.20
- వ్యాపారుల మోసాలతో రైతుల్లో భయం


కోతకు సిద్ధంగా ఉన్న కరివేపాకు

తాడిపత్రి రూరల్‌: ప్రస్తుతం కరివేపాకు ధర ఆశాజనకంగా ఉంది. మార్కెట్‌లో కిలో రూ.20లు పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కరివేపాకును నాణ్యతను బట్టి మూడు రకాలుగా విభజిస్తారు. మొదటి క్వాలిటీకి ఎక్కువ ధర ఉంటోంది. రైతులు పెరిగిన ధరను క్యాష్‌ చేసుకునేందుకు పూర్తి స్థాయిలో పంట చేతికి రాకమునుపే కోతలను ప్రారంభిస్తున్నారు. గుంటూరు, ప్రకాశం తదితర జిల్లాల్లో కోతకు వచ్చిన కరివేపాకు పెద్దఎత్తున మార్కెట్లకు తరలిరావడం వల్ల ప్రస్తుతం ఉన్న ధర తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. సాధారణంగా పంట నాలుగు నెలల తరువాత పూర్తిస్థాయిలో చేతికి వస్తుంది. సజావుగా పంట పండితే ఎకరాలకు 10 టన్నుల నుంచి 18 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ప్రస్తుత ధరను దృష్టిలో ఉంచుకొని రెండు నుంచి మూడు నెలల లోపు ఉన్న పంట 10 నుంచి 15 టన్నుల లోపు దిగుబడి రానున్న పంటను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు పూర్తి స్థాయి పంట దిగుబడితోపాటు పెరగనున్న ధర కోసం ఎదురు చూస్తున్నారు.

తెగుళ్ల నుంచి కాపాడుకుంటూ..

కరివేపాకు పంటను ఆశించే తెగుళ్ల నివారణ కోసం రైతులు రూ.వేలకు వేలు ఖర్చు చేసి పురుగుల మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. పంటకు ఆకు మచ్చ, త్రిప్స్‌, ఎండు తెగులు, ఆకుముడత తదితర తెగుళ్లు ఆశిస్తాయి. వీటిలో ఏ తెగులు ఆశించినా పంటకు సకాలంలో నివారణ చర్యలు తీసుకోకుంటే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా తెగుళ్లు సోకిన పంటను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. డిమాండ్‌ ఉంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రైతులకు తీవ్ర నష్టం రానుంది.

ప్రధాన మార్కెట్‌గా చెన్నై

తాడిపత్రి ప్రాంతంలో తాడిపత్రి, పెద్దపప్పూరు, పుట్లూరు మండలాల్లో రైతులు కరివేపాకు పండిస్తున్నారు. అత్యధికంగా తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లిలో సాగు చేస్తున్నారు. గతంలో రాష్ట్రంలో అత్యధికంగా పండించే గ్రామంగా యర్రగుంటపల్లి ప్రసిద్ధికెక్కింది. డిమాండ్‌, లాభాలు తదితర కారణంగా వల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు కరివేపాకు సాగు విస్తరించింది. తాడిపత్రి ప్రాంతంలో పండించే కరివేపాకు ప్రధాన మార్కెట్‌ చెన్నై. రోజూ పది వాహనాల్లో కరివేపాకు చెన్నై మార్కెట్‌కు తరలిస్తుంటారు. మరో పది వాహనాలు హైదరాబాద్‌, బెంగళూరు తదితర మార్కెట్‌లకు రవాణా చేస్తుంటారు.

వ్యాపారుల కుచ్చుటోపీ

తాడిపత్రి ప్రాంతంలో కరివేపాకు సాగు తగ్గుముఖం పట్టడానికి వ్యాపారులు, దళారుల మోసాలే కారణమవుతున్నాయి. ప్రతి ఒక్కరూ వ్యాపారులుగా అవతారం ఎత్తడంతో పాటు డబ్బు ఆశ కారణంగా రైతులను ముంచుతున్నారు. గతంలో వ్యాపారులను నమ్మిన రైతులు నట్టేట మునిగారు. లక్షలాది రూపాయలను నష్టపోయారు. ఒకరిని చూసుకుని మరొకరు రైతులను ముంచుతున్నారు. వ్యాపారులను నమ్మిన రైతులు అప్పుగా కరివేపాకును టన్నుల రూపంలో విక్రయిస్తున్నారు. అప్పు తీర్చడంలో వ్యాపారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతంలో కరివేపాకు ద్వారా బకాయి పడ్డ వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

ధర నిలకడగా ఉంటే లాభదాయకం



కరివేపాకు ధర నిలకడగా ఉంటే రైతులకు లాభదాయంగా ఉంటోంది. ఎప్పుడు ధర పెరుగుతుందో ఎప్పుడు తగ్గుతుందో తెలియడం లేదు. గతంలో ధరలో నిలకడ లోపం వల్ల ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. ప్రస్తుతం ఉన్న ధర మరికొన్ని రోజులు ఉంటే రైతులకు మేలు జరుగుతుంది.

– రంగయ్య, రైతు, యర్రగుంటపల్లి

గతంలో నష్టపోయాం



కరివేపాకు పంటను నమ్ముకుని తీవ్రంగా నష్టపోయం. గతంలో నాలుగు ఎకరాల్లో కరివేపాకు పంటను సాగు చేశాను. ధర పతనం కావడంతో నిండా మునిగిపోయాను. కరివేపాకు పంటను సాగు చేయాలంటే భయంగా ఉంటోంది. ప్రస్తుతం ధర ఆశాజనంగా ఉంది. కిలో రూ.20 పలుకుతుండడంతో రైతులకు లాభదాయకం.

– కిరణ్‌, రైతు చింతకుంట

సకాలంలో మందులు పిచికారీ చేయాలి



కరివేపాకు పంటను ఆశించే తెగుళ్లపై రైతులు జాగ్రత్తగా ఉండాలి. సకాలంలో తెగుళ్లను గుర్తించి మందులను పిచికారీ చేయాలి. తెగుళ్లకు సంబంధించిన వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. అవగాహన లేకుండా పురుగుల మందులను పిచికారీ చేసి దబ్బును వృథా చేసుకోవద్దు.

– ఉమాదేవి, ఉద్యానవనశాఖ అధికారి

వైభవంగా దీపావళి వేడుకలు




గుంతకల్లులో మహాలక్ష్మి హోమం నిర్వహిస్తున్న దృశ్యం, కసాపురంలో ధనలక్ష్మి పూజ నిర్వహిస్తున్న అర్చకులు, పెద్దవడుగూరులో టపాసులు కాల్చుతున్న దృశ్యం

గుంతకల్లుటౌన్‌/గుంతకల్లురూరల్‌/యల్లనూరు/పెద్దవడుగూరు/గార్లదిన్నె/యాడికి/పామిడి : గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ఇళ్లు, దుకాణాలన్నీ దీపాల కాంతులతో విరజిమ్మాయి. నూతన వస్త్రాలంకరణతో చిన్నా, పెద్ద సందడి చేశారు. తమ ఇళ్ల, దుకాణాల ముందు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. దీపావళి పండుగను పురస్కరించుకుని శుక్రవారం గుంతకల్లులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గణపతి, వాసవీమాత, మహాలక్ష్మి హోమాలను నిర్వహించారు. అనంతరం అక్షయపాత్రలో భక్తులకు తీర్థ,ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్‌, కార్యదర్శి కృపాకర్‌, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు. అలాగే కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం ధనలక్ష్మి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖమండపంలో సీతాదేవి అమ్మవారిని ధనలక్ష్మిగా కొలువుదీర్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. పూజా ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు, పెద్దవడుగూరు, గార్లదిన్నె మండలాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చుతూ సంతోషంగా పండుగను బంధువుల నడుమ జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. యాడికిలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, రమేష్‌ నాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తల మధ్య టపాసులు కాల్చుతూ దీపావళి సంబరాలు నిర్వహించారు. కాగా పామిడిలో దీపావళి పండుగ కానరాలేదు. ఏడాదికేడాది టపాసుల ధరలు పెరుగుతుండడంతో.. బాణసంచా కొనేందుకు, కాల్చేందుకు యువత అనాసక్తి చూపుతోంది.

6న మండల సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహిస్తామన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సెల్‌ఫోన్‌ చోరీ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో గురువారం ఓ మహిళకు చెందిన సెల్‌ఫోన్‌ చోరీ జరిగింది. పోలీసుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన ప్రమీలమ్మ అనే మహిళ ఇంటి వద్ద రూ.20 వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ మంచం మీద ఉంచింది. గుర్తుతెలియని వ్యక్తి సెల్‌ఫోన్‌ దొంగలించినట్లు శుక్రవారం ఆమె పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. మహిళ ఫిర్యాదు మేరకు సెల్‌ఫోన్‌ చోరీ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ గౌస్‌ మహమ్మద్‌ బాషా తెలిపారు.

ఈఓకు సన్మానం

పామిడి: పామిడి పంచాయతీ ఈఓ ఎం.గోపాల్‌ను మండల యూత్‌ శుక్రవారం ఘనంగా సన్మానించింది. పామిడిలో ఆక్రమణల తొలగింపులో ప్రత్యేక చొరవ చూపి రోడ్డు విస్తరణ చేపట్టడంలో ఈఓ కృషిని గుర్తిస్తూ వారు సన్మానం చేపట్టారు. కార్యక్రమంలో పామిడి మండల యువత బృందం సూర్యనారాయణ, రాము, రామాంజనేయులు, వీరప్రతాప్‌, నాగేంద్ర, శివ, రవితేజ, ధనుంజయ, సందీప్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి నిల్చున్న టిప్పర్‌ను ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మిడుతూరు గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, రాకేష్‌ ద్విచక్ర వాహనంలో పెద్దవడుగూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీ కొట్టారు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పామిడికి తరలించినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

టపాసుల సీజ్‌

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన పరశురాం అనే వ్యక్తి అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తుండగా ఎస్‌ఐ శ్రీరామ ప్రసాద్‌ తన సిబ్బందితో దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.15 వేలు విలువ చేసే టపాసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్‌పై అదనపు డబ్బు వసూలు చేస్తే చర్యలు

పామిడి: ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులనుంచి రేషన్‌ సరుకులపై అదనపు డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్‌ ఎన్‌ శ్రీధరమూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన ధరల మేరకు కిలో కందిపప్పు రూ.67, అరకిలో చక్కెర రూ.17కే రేషన్‌కార్డుదారులకే అందజేయాలన్నారు. ఎండీయూ వాహనదారులు రేషన్‌పై అదనపు వసూళ్లకు పాల్పడితే 9493188834, 9491619840 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై చీటింగ్‌ కేసు

తాడిపత్రి అర్బన్‌: తప్పుడు జనన ధ్రువీకరణ పత్రంతో విధుల్లోకి చేరిన ఓ అంగన్‌వాడీ కార్యకర్తపై అర్బన్‌ పోలీసులు శుక్రవారం చీటింగ్‌ కేసు నమోదు చేశారు. అర్బన్‌ సీఐ సాయి ప్రసాద్‌ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్త నాగేశ్వరమ్మ విధుల్లో చేరే సమయంలో తప్పుడు పుట్టిన తేదీ విద్యార్హత పత్రాన్ని ఐసీడీఎస్‌ అధికారులకు సమర్పించి విధుల్లో చేరింది. ఈ విషయంలో ఫిర్యాదు రావడంతో, ఐసీడీఎస్‌ అధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టారు. విచారణలో ఆమె నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు గుర్తించారు. జిల్లా ఐసీడీఎస్‌ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాడిపత్రి ఐసీడీఎస్‌ సీడీపీఓ షాజిదా బేగం పట్టణ పోలీసులకు ఆ అంగన్‌వాడీ కార్యకర్తపై ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

‘బుగ్గ’లో నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు



గుంతకల్లు రూరల్‌: ప్రసిద్ధ శైవ క్షేత్రం బుగ్గ సంగమేశ్వర ఆలయంలో శనివారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నాలుగు సోమవారాల పాటు భక్తులు ఆలయానికి భారీఎత్తున తరలిరానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టినట్లు ఈఓ క్రిష్ణయ్య తెలిపారు. అలాగే ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా శివప్రీతి దీపోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం ఆలయంలో నిత్యాన్నదానం, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సంతాన సంగమేశ్వరుడిగా, కళ్యాణ సంగమేశ్వరుడిగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర స్వామిని దర్శించుకోవడంతోపాటు కార్తీక మాసంలో ఆలయ పరిసరాల్లో దీపారాధన చేసేదుకు భక్తులు భారీగా తరలిరానున్నారు.

శ్రీశైలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తాడిపత్రి అర్బన్‌: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్‌ జీఎల్‌ శంకర్‌ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది కూడా కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామన్నారు. రోజూ ఉదయం 7గంటలకు తాడిపత్రి డిపో నుంచి బస్సు బయలుదేరుతుందని, అదే విధంగా ఉదయం 10 గంటలకు శ్రీశైలంలో మరో బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ సర్వీసులకు రిజర్వేషన్‌ సౌకర్యం కూడా ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 7382860183, 7382861803,9959225856 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

గుంతకల్లుటౌన్‌/పామిడి/గుత్తి: పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగింది. గుంతకల్లు పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్‌ కమిషనర్‌ నయీమ్‌ అహ్మద్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా సర్వర్‌ మొరాయించడంతో మూడు గంటల పాటు పంపిణీలో ఆలస్యం జరిగింది. అలాగే పామిడి అర్బన్‌లో 3,107 పింఛన్లకు గానూ 3,048 మందికి, రూరల్‌లో 4,410 పింఛన్లకు గానూ 4,275 మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. కాగా వార్డుల్లోని ఒక ప్రాంతంలోకి పింఛన్‌దారులను పిలిపించి పింఛన్ల పంపిణీ చేపట్టడంపై లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. అదేవిధంగా గుత్తి మున్సిపాలిటీ వ్యాప్తంగా శుక్రవారం పింఛన్‌ పంపిణీ కి సంబంధించిన డివైస్‌ సర్వర్లు పని చేయలేదు. దీంతో ఆరు గంటల పాటు పింఛన్‌ పంపిణీ నిలిచిపోయింది. ఉదయం 7 గంటల వరకు మాత్రమే సర్వర్లు పని చేశాయి. తర్వాత 2 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పని చేయలేదు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత సర్వర్లు పని చేయడంతో అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


తాడిపత్రిలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు


గుంతకల్లులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆవోపా నాయకులు

తాడిపత్రి అర్బన్‌/గుంతకల్లు టౌన్‌/గుత్తి/పామిడి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌ అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పెన్షనర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు శుక్రవారం పెన్షనర్స్‌ భవన్‌లో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు ఆదినారాయణరెడ్డి, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులోని మెయిన్‌రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నకేశవులు, రాము, రఘు, సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా గుత్తిలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబూ బకర్‌, నాయకులు శామ్యూల్‌, వెంకటేష్‌, ఫక్రుద్దిన్‌, రామ్మోహన్‌, కుళ్లాయి బాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌ అవతరణ దినోత్సం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పామిడిలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాటు సారా విక్రేతల అరెస్టు

గుత్తి రూరల్‌: మండలంలోని బేతాపల్లి గ్రామ శివారులో నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, సూరి నాటు సారా తెచ్చి గ్రామంలో విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్‌ కలిసి గ్రామ శివారులో కాపు కాచారు. ఈ సందర్భంగా నాగరాజు, సూరిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 12 లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో హెడ్‌ కానిస్టేబుల్‌ నీలకంఠ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్‌: మండలంలోని బేతాపల్లి శివారులో ద్విచక్రవాహనం బోల్తా పడి చైతన్య అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఉప్పర్లపల్లికి చెందిన చైతన్య గురువారం రాత్రి గుత్తి పట్టణంలో బాణాసంచా కొనుగోలు చేసి గ్రామానికి తిరిగి వెళ్తున్నాడు. బేతాపల్లి గ్రామ శివారులో కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నైపుణ్యాలుంటే ఉద్యోగావకాశాలు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్‌ ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్‌ విద్యార్థులకు నైపుణ్యాలు ఉంటే ఉద్యోగాలు తప్పనిసరిగా లభిస్తాయని ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్‌ ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్‌) ఇంజినీరింగ్‌ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బాలక్రిష్ణ మాట్లాడుతూ అనంతపురం నగరంలోని ఎస్కే యూనివర్శిటీలో అటల్‌ ఇంక్యుబేషన్‌ సెంటర్‌ నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇగ్నైట్‌–7.0లో 25 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. కరెస్పాండెంట్‌ ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ బీటెక్‌ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మంచి కంపెనీల్లో ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ రంజిత్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌, ఐక్యూఏసీ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సాయి చైతన్య కిషోర్‌, ఐ అండ్‌ ఈడీపీ సెల్‌ కన్వీనర్‌ డాక్టర్‌ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్‌ పరేడ్‌ శిబిరానికి ఎంపిక


విద్యార్థిని ఇందూను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్‌: మహారాష్ట్రలోని జాల్గవ్‌లో ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకూ నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్‌ పరేడ్‌ శిబిరానికి శ్రీశంకరానంద డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థిని, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ ఇందూ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ గోపాల్‌ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందూను ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్లు శివయ్య, డాక్టర్‌ నాగార్జున, అధ్యాపకులు క్రిష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌

శింగనమల: జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం శింగనమలలో సీపీఐ మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. జిల్లాలోని 7 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, మిగిలిన 24 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతు సమస్యలపైన ఈనెల 4న అన్ని మండలాల తహసీల్దార్‌ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్‌ చోరీ

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లిలో గురువారం కేబుల్‌ చోరీ జరిగింది. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తొమ్మిది మంది రైతులకు చెందిన వ్యవసాయ బోరు బావుల వద్ద కేబుల్‌ను అపహరించారు. ఈ చోరీల వల్ల రైతులు సరైన సమయంలో పంటలకు నీరు అందించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. మడ్డిపల్లి–నార్పల రోడ్డు సమీపంలో ఉన్న తోటల్లో చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పామిడికి చేరిన రథయాత్ర


స్వామీజీకి స్వాగతం పలుకుతున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్‌ వీరాంజనేయులు

పామిడి: కర్ణాటక నుంచి నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లిలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట రథయాత్ర శుక్రవారం రాత్రి పామిడికి చేరింది. ఈసందర్భంగా జగద్గురు వాల్మీకి ప్రసన్నానందపురి మహాస్వామిజీకి ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్లు ఎం.లిఖిత, ఎం.వీరాంజనేయులు కుటుంబం ఘన స్వాగతం పలికారు. దారిపొడవునా ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతించారు, రాత్రికి ఆయన వీరాంజనేయులు ఇంట బస చేశారు.

సీఐకి జిల్లా ఎస్పీ అభినందనలు


ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం తీసుకుంటున్న సీఐ

శింగనమల: శింగనమల సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ కౌలుట్లయ్యను జిల్లా ఎస్పీ జగదీష్‌ అభినందించారు. నార్పల ఏటీఎం చోరీ కేసును ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో సీఐ, సిబ్బంది కీలక పాత్ర పోషించారు. దీనితో సీఐ కౌలుట్లయ్యకు అప్రిషియేట్‌ సర్టిఫికెట్‌ అందించారు. సర్కిల్‌ పరిధిలోని శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్‌ డీఎస్పీ వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

తాడిపత్రి అర్బన్‌: ఏఐటీయూసీ 150వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని గాంధీకట్ట వద్ద ఏఐటీయుసి జెండాను ఎగరవేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్‌ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌ సంస్థల కొమ్ముకు కాస్తున్నాయని విమర్శించారు. కాంట్రాక్ట్‌ ఔట్‌సోర్సింగ్‌ కార్మికులందరినీ వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్‌, రమణ, రవికుమార్‌, రాజు, రామకృష్ణ, రామాంజనేయులు, రాజు, సాలవేముల సూరి, శ్రీరాములు, రత్నమయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

యాడికి: మండలంలోని పిన్నేపల్లిలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన రైతు పుల్లారెడ్డి పాము కాటుకు గురయ్యాడు. తోట వద్దకు నడుచుకుంటూ పోతుండగా గడ్డిలో ఉన్న పామును పుల్లారెడ్డి తొక్కడంతో కరిచింది. కుటుంబసభ్యులు ఓ వాహనంలో అతడిని తాడిపత్రికి తరలించి అక్కడ వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి మృతి


మహమ్మద్‌ రఫీ(ఫైల్‌)

యాడికి: రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి మహమ్మద్‌ రఫీ కర్నూలులో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం యాడికికి చేరుకుంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ బొంబాయి రమేష్‌ నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్‌, పలు పార్టీల నాయకులు, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారలు తరలివచ్చి మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రాణహాని ఉందని ఫిర్యాదు

గుత్తి: నెల్లూరుకు చెందిన ట్రాన్స్‌జెండర్లు హాసిని, మహేశ్వరి, గుత్తికి చెందిన రేష్మినుంచి తమకు ప్రాణ హాని ఉందని గుత్తికి చెందిన పలువురు ట్రాన్స్‌జెండర్లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌జెండర్లు సాయి, నిత్య, హనీ, సుప్రియ, జున్ను, కౌసల్య, గాయత్రి తదితరులు పోలీసులు ఆశ్రయించారు. హాసిని, మహేశ్వరి, రేష్మి తమను వారి గ్రూప్‌లో చేరి భిక్షాటన చేసి డబ్బును వారికి ఇవ్వాలని బలవంతం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తమను కాపాడాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

రస్తా విషయంలో ఘర్షణ


గాయపడిన రాజశేఖర్‌రెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని చింతలచెరువులో పొలానికి వెళ్లే రస్తా విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. ఈ ఘర్షణలో జగదీశ్వరరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. జగదీశ్వర్‌రెడ్డికి రామకృష్ణారెడ్డి వర్గానికి గత రెండేళ్ల నుంచి రస్తా వివాదం జరుగుతోంది. గత సంవత్సరం కూడా ఘర్షణ పడి స్టేషన్‌కు రావడంతో పోలీసులు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఈ క్రమంలో మళ్లీ ఘర్షణ పడటంతో జగదీశ్వరరెడ్డి, అతని కుమారుడికి, వెంకటకృష్ణారెడ్డి, కల్పన, శ్రీనివాసరెడ్డికి గాయాలయ్యాయి. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.